క్లుప్తంగా

9న వందే ముకుంద్



ఆహ్వాన పత్రికలు అందిస్తున్న లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ కృష్ణమూర్తి

ఉండి: ఈ నెల 9వ తేదీన ఆకివీడులో లయన్స్ క్లబ్ వందే ముకుంద్ ఆర్‌సీ మీట్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు క్లబ్ జోనల్ చైర్మన్ గొంట్ల కృష్ణమూర్తి అన్నారు. బుధవారం ఉండిలో వందే ముకుంద్ సమావేశానికి ఉండి లయన్స్‌క్లబ్ కార్యవర్గ సభ్యులు,ప్రతినిధులకు ఆహ్వానపత్రికలు అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ 9వ తేదీన ఆకివీడులో నిర్వహిస్తున్న వందే ముకుంద్ ఆర్‌సీ సమావేశానికి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్‌లో ఉన్నత సేవలందిస్తున్న మహిళా సభ్యులకు సత్కారాలు చేస్తామన్నారు. ఉత్తమ సేవలందిస్తున్న లయన్స్ క్లబ్‌లకు అవార్డులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉండి క్లబ్ కార్యదర్శి ముదునూరి శివరామరాజు,బొండాడ కేశవరావు,కాగిత మహంకాళి,గాదిరాజు వెంకటేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

రథం మరమ్మతులకు విరాళం



నూతన రథశాల వద్ద ఆలయ కమిటీ సభ్యులు

భీమవరం(ప్రకాశం చౌక్): స్థానిక హౌసింగ్ బోర్డ్ కాలనీ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి వారి రథం, రథశాలను మరమ్మతులకు రుద్రరాజు శ్రీధర్ వర్మ రూ.లక్ష విరాళం అందించగా, ఈ నిధులతో స్వామి వారి రథం మరమ్మతులు చేయించి నూతన రథశాలను బుధవారం ముహూర్తం చేశారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు మాట్లాడుతూ ఏప్రిల్‌లో నిర్వహించే బ్రహ్మోత్సవాలకు స్వామి వారి రథం సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. రథశాలకు, ఆలయ అభివృద్ధికి సహకరించిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కుక్కల బాల వెంకటరత్నం, పాణింగిపల్లి శ్రీనివాసాచార్యులు రుద్రరాజు శ్రీధర్ వర్మ, కడలి వెంకటేశ్వరరావు, గొన్న బత్తుల మల్లేశ్వరరావు మామిడిశెట్టి జయకుమార్, చల్లగండ్ల వెంకట లింగ సత్యనారాయణ, అల్లూరి బంగార్రాజు, మట్టా నలిని మోహన్, తదితరులు పాల్గొన్నారు.

యమపాశాలుగా విద్యుత్ వైర్లు

- గాడితప్పిన ఆక్వా విద్యుత్ వ్యవస్థ
- రోడ్లు, కొబ్బరి చెట్లు, చెరువు గట్లపై విద్యుత్ వైర్లు
- ప్రభుత్వ స్థలాలు, రోడ్ల పక్కన ట్రాన్స్‌ఫార్మర్లు
- ఆక్వా చెరువులపై పలువురు మృతి
- పట్టించుకోని విద్యుత్ అధికారులు



చెరువు గట్టుపై ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లు



ప్రభుత్వ స్థలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అమర్చిన అధికారులు

ఉండి: నియోజకవర్గంలో కాసులు కురిపిస్తున్న ఆక్వా చెరువుల వద్ద విద్యుత్ వ్యవస్థ తీవ్ర అస్తవ్యస్తంగా, అత్యంత దారుణంగా ఉంది. ఇష్టానుసారంగా విద్యుత్ కనెక్షన్లు, అంతకంటే దారుణంగా చెరువుల వద్ద నడిరోడ్డుపైనా, చెరువుగట్లపైనా విద్యుత్ వైర్లు కనిపిస్తున్నాయి. దీనికి రైతు గాని విద్యుత్ అధికారులుగానీ ఎవ్వరూ సమాధానం చెప్పరు. ప్రభుత్వ స్థలాలు, రహదారులు, కాలువ, పంటబోదెగట్లే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు ఆవాసాలుగా నిలిచాయి. నియోజకవర్గంలో ఇంత జరుగుతున్నా ఇరిగేషన్, డ్రెయినేజీ, రెవెన్యూ అధికారులు కిక్కురుమనరు. దీనికి కారణం ఆమ్యామ్యాలేనని పలువురు చెబుతున్నారు. ఎవరైనా చిరువ్యాపారులు ప్రభుత్వ స్థలంలో బడ్డీ కొట్టు గాని, టీ స్టాల్ గాని పెట్టుకుంటే నానా హైరానా చేస్తున్న అధికారులు ఆక్వా సాగు మాటున అనేక అక్రమాలు జరుగుతుంటే ఏ అధికారి నోరు మెదపడం లేదని బహిరంగంగానే విమర్శిస్తున్నారు. రైతుల స్థలంలో దానికి తగిన విధంగా విద్యుత్ అధికారులే ఏర్పాట్లు చేసి ఆక్వా చెరువులకు ట్రాన్స్‌ఫార్మర్లు బిగించాలి. కాని ప్రభుత్వ స్థలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. అంతే కాకుండా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు ప్రత్యేకంగా దిమ్మలు ఏర్పాటుచేసుకుని వాటిపై బిగించాలి. విద్యుత్ అధికారులు మాత్రం ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ స్తంభాలకే ట్రాన్స్‌ఫార్మర్లను బిగిస్తున్నారు. దీంతో వందల మీటర్ల దూరం రైతు విద్యుత్ వైర్లు లాక్కోవలసిన పరిస్థితి తలెత్తింది. సామాన్యులపై ప్రతాపం చూపించే విద్యుత్ అధికారులు గృహావసరాలకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు నానా తిప్పలు పెడుతుంటారు. కానీ ఆక్వా విద్యుత్ కనెక్షన్ అనగానే ఎగిరి గంతేసి నిబంధనలకు పాతర వేస్తున్నారు. అంత అత్యుత్సాహం ఎందుకో వారికే తెలియాలి.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరు

ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద నుంచి విద్యుత్ వైర్లను రైతులు రోడ్ల పక్కన ఉండే కొబ్బరి చెట్లు, చెరువుగట్లపై నేలమీద వేసుకుంటూ వెళ్లిపోతున్నారు. వీటి వలన గతంలోనూ, ఇప్పుడు కూడా చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. అయితే ఇదంతా గుట్టుచప్పుడు కాకుండా ఆయా కుటుంబాలతో రహస్య మంతనాలు చేసి సెటిల్‌మెంట్లు చేసుకుని ప్రాణాలకు వెల కట్టేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భద్రతా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

నివారణ చర్యలు చేపట్టాలి



ఆక్వా చెరువుల వద్ద విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటం చాలా ప్రమాదకరం. ఎప్పుడూ అక్కడ మనుషులు తిరుగుతారు. పైగా ఎప్పుడు నీటిలోనే పని ఉంటుంది. కాబట్టి అటువంటి ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్ల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసుకోవాలి. – జంపా నాగేశ్వరరావు, ఉండి

అధికారుల్లో ఎందుకింత నిర్లక్ష్యం



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు రోడ్ల పక్కన, కాలువ గట్లపై వేసి చేతులు దులుపుకుంటున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి. ప్రజల ప్రాణాలంటే లెక్క చేయకపోవడం చాలా దారుణం. అధికారులు నిర్లక్ష్య వైఖరి విడిచిపెట్టాలి. ఇప్పటికైనా నివారణ చర్యలు చేపట్టాలి. – శేషాద్రి శ్రీను, ఉండి

మహిళా దినోత్సవ ఏర్పాట్లపై జేసీ సమీక్ష

భీమవరం (ప్రకాశంచౌక్): మార్చి 8న ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించనున్న మహిళా దినోత్సవ కార్యక్రమాల ఏర్పాట్లపై బుధవారం కలెక్టరేట్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో సంబంధిత శాఖల అధికారులతో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి, సమీక్షించారు. సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మహిళల పండుగగా పేర్కొనే మహిళా దినోత్సవం రోజున ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో భీమవరంలో మహిళలు, విద్యార్థినులతో భారీ ర్యాలీ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ మొగిలి వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి బి.సుజాత రాణి, డీఈవో ఇ.నారాయణ, ఐబి పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

ఉపవాస దినాలు ప్రారంభం

ఆకివీడు: మండలంలోని చెరుకుమిల్లి గ్రామంలోని సీఎస్ఐ దేవాలయంలో ఉపవాస దినాలు ప్రారంభించినట్లు కౌన్సిల్ సభ్యులు ఎరిచర్ల సాంబర్లిన్ చెప్పారు. క్రైస్తవులు పరిసుద్ధ దినాలుగా ఈ రోజులను భావించి ఉపవాస ప్రార్థనలు చేస్తారన్నారు. ప్రభు బోధనలు, సంస్కార ఆరాధనలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దేవుని మహిమ ప్రార్థనలు జరుగుతాయన్నారు. ఈ నెల 5వ తేదీ నుండి గుడ్ ఫ్రైడే వరకూ ఉపవాస ప్రార్థనలుంటాయని చెప్పారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు గండి రత్నరాజు, టీ.సామ్యేలు, వై.పెద ఏసు, వై.దానియేలు, బీ.కిషోర్, విశ్వాసులు ప్రార్థనలో పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన శ్రమ కాల ప్రార్థనలు



లూథరన్ చర్చిలో వాక్యోపదేశం చేస్తున్న పాస్టర్ మేషక్ సతీష్ కుమార్

ఉండి: ప్రతి ఏటా అత్యంత భక్తి శ్రద్ధలతో క్రైస్తవులు నిర్వహించే 40 రోజుల శ్రమకాల ప్రార్థనలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. మండల వ్యాప్తంగా ఉదయం పలు ప్రార్థనా మందిరాల్లోనూ, సాయంత్రం మరికొన్ని ప్రార్థనా మందిరాల్లోనూ ప్రత్యేక ఉపవాస ప్రార్థనలు నిర్వహించారు. ఈ నెల 5వ తేదీ బుధవారం ప్రారంభమైన శ్రమకాల ధ్యాన్య ప్రార్థనలు 40 రోజుల పాటు నిర్వహించగా ఏప్రియల్ 18వ తేదీ గుడ్ ఫ్రైడే రోజున ప్రత్యేక ఉపవాస ప్రార్థనలు ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తారు. ఏప్రియల్ 19వ తేదీతో ముగుస్తాయి. తరువాత ఆదివారం అనగా 20వ తేదీ ఈస్టరు పండుగతో పూర్తియ స్థాయిలో కార్యక్రమం ముగుస్తుంది. బుధవారం నిర్వహించిన మొదటి రోజు ఉపవాస ప్రార్థనల్లో క్రైస్తవులు ఆయా సంఘాల్లో పెద్ద ఎత్తున పాల్గొని ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎన్నార్పీ అగ్రహారం ట్రినిటీ లూథరన్ చర్చిలో రైట్ రెవరెండ్ మేషక్ సతీష్ కుమార్, యండగండి ఇమ్మానుయేలు లూథరన్ చర్చిలో నిర్వహించిన ప్రార్థనల్లో పేరిష్ పాస్టర్లు రెవరెండ్ డి.ప్రసాదరావు, రెవరెండ్ వి.నెహ్రూ పాల్గొని ప్రసంగించారు. మనిషి మార్పుకు నిర్వహించేవే ఈ శ్రమకాల ధ్యాన్య ప్రార్థనలని తెలిపారు. 40 రోజుల ఉపవాసం వలన మనిషిలో తప్పకుండా మార్పు వస్తుందన్నారు. ఏసుక్రీస్తుని బోధనలు విని వాటిని అనుసరించి నడిస్తే తప్పకుండా పాపం మనలో నుంచి పోతుందని అప్పుడే తప్పకుండా దేవునికి ఇష్టంగా మారతామన్నారు. దేవుడు ప్రపంచంపై చూపించిన ప్రేమను ప్రతి క్రైస్తవుడు కలిగి ఉండాలన్నారు. క్రైస్తవునిలో మారు మనస్సు లేకపోతే ఎంతకాలం ప్రార్థనలు చేసినా అవి నిష్ఫలంగానే ఉంటాయని గుర్తుంచుకోవాలని సూచించారు. మనం మంచి చేస్తే దేవుని నుంచి మనకు మంచి లభిస్తుందని చెడు చేసే వారు తప్పకుండా ప్రతి ఫలం పొందుతారన్నారు. ఈ 40 రోజుల్లో ప్రతి ఒక్కరూ దేవునికి ప్రార్థనలు చేస్తూ నిరాడంబరంగా జీవించాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో సంఘ సీఆర్‌లు ,సంఘ పెద్దలు, చర్చ్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

జింక్ లోపాన్ని నివారించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ సీహెచ్ శ్రీనివాస్

భీమవరం అర్బన్: వరిలో జింకు లోపాన్ని నివారించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఏడీఏ శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలంలోని తుందుర్రు గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆలస్యంగా వరినాట్లు వేసిన చోట జింకు లోపం ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. జింకు లోపాన్ని నివారించేందుకు చిలేటెడ్ జింకును చల్లాలన్నారు. అంతే కాకుండా ప్రతి రోజూ తమ పొలాలను రైతులు పరిశీలించాలన్నారు. తద్వారా పైరుపై ఆశించిన తెగులును గుర్తించి నివారించొచ్చన్నారు. మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ మాట్లాడుతూ వరి పైరుపై ఆశించే తెగులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

హరిహరనామావృత లేఖన యజ్ఞం



హరిహరనామావృత లేఖన పత్రాలను చూపిస్తున్న భక్తులు

భీమవరం(ప్రకాశం చౌక్): భారతీ తీర్థ స్వామి వారి ఆజ్ఞ మేరకు యావత్ భారతదేశం హరిహరనామావృత లేఖన యజ్ఞం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా భీమవరం పంచారామ క్షేత్రానికి విచ్చేసిన హరిహరనామావృత లేఖన పత్రాలను శ్రద్ధగా పూర్తి చేసిన లేఖలను బుధవారం పంచారామ క్షేత్ర సోమేశ్వర స్వామి వారికి సమర్పించి అనంతరం శృంగేరికి పంపిస్తామన్నారు.

సంస్కృతికి చక్కటి చిరునామా మాతృమూర్తి

భీమవరం (ప్రకాశం చౌక్): సంస్కృతికి చక్కటి చిరునామా మాతృమూర్తి అని డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాల గ్రంథాలయ అధికారిణి ఇందుకూరి శిరీష అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, జిల్లా సర్వోదయ మండలి అధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవ వేడుకలలో భాగంగా శ్రీరాంపురంలోని గాంధీ కస్తూరిభా మహిళా కేంద్రంలో సదస్సు, విద్యార్థులకు పోటీలు, మహిళలకు కుట్టు అల్లికలు పోటీలు విశిష్ట మహిళలను సత్కరించడం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందకూరి శిరీష, మహిళ కేంద్రం నిర్వాహకురాలు రత్నమాల మాట్లాడుతూ ప్రతి అంశంలోనూ దశలోనూ సమాజంలో మహిళలు కీలక ప్రాత పోషిస్తుందన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ మహిళ కేంద్రంలో 16 మందికి కుట్లు అల్లికలపై పోటీలను నిర్వహించామని, విద్యార్థులకు వ్యాస రచన పోటీలను నిర్వహించామని, 7వ తేదీన ఎమ్మెల్యే అంజిబాబు ఇంటి వద్ద జరిగే మహిళ దినోత్సవ వేడుకలలో ఇన్నర్ వీల్ క్లబ్ సౌజన్యంతో బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సర్వోదయ మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాద్ రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంకులో మెడికల్ క్యాంపు



ర్యాలీ నిర్వహిస్తున్న యూనియన్ బ్యాంకు ఉద్యోగులు

భీమవరం(ప్రకాశం చౌక్): మహిళా దినోత్సవం పురస్కరించుకుని నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా భీమవరం యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా రిజనల్ ఆఫీస్ ఆధ్వర్యంలో ముందుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం రిజనల్ కార్యాలయంలో మెడికల్ క్యాంపు నిర్వహించి సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో రిజనల్ హెడ్ పి.సంగీత కుమారి, డీఆర్‌హెచ్ వెంకన్నబాబు, చీఫ్ మేనేజర్ రమ ణ, బ్రాంచి మేనేజర్ సిబ్బంది పాల్గొన్నారు.

భాషలో వ్యాకరణం ముఖ్యం

ఆకివీడు: ఏ భాషకైనా వ్యాకరణం ముఖ్యమని ప్రధానోపాధ్యాయులు ఆర్‌వీ నారాయణ (విక్రమ్) చెప్పారు. మండలంలోని అజ్జమూరు గరువులో ఎంపీపీ పాఠశాలలో బుధవారం జాతీయ వ్యాకరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ 3, 4, 5 తరగతుల విద్యార్థులు మూడు భాషల్లో వ్యాకరణం నేర్చుకుని భాషపై పటుత్వం సాధించాలన్నారు. పోటీ పరీక్షల్లో మూడు భాషలపై వ్యారణం ఎంతో ప్రాముఖ్యతను సాధిస్తుందన్నారు. విద్యార్థులు వ్యాకరణం పట్ల ఆసక్తి చూపించాలని విజ్ఞప్తి చేశారు. వ్యాకరణాన్ని విద్యార్థి ప్రాథమిక దశలోనే నేర్చుకోవాలని నారాయణ సూచించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

భీమవరం (ప్రకాశం చౌక్): ఎస్ఆర్ కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల వాకర్స్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా భూపతిరాజు సత్యనారాయణ రాజు, అధ్యక్షుడు గ్రంధి ప్రసాద్, కార్యదర్శి దంతులూరి శ్రీధర్ రాజు, కోశాధికారి పల్లికొండ పీటర్, వైస్ ప్రెసిడెంట్ దాట్ల కనక పుల్లంరాజు, జాయింట్ సెక్రటరీలు చుక్కా అనిల్, జాలి వాకర్ మందపాటి నరసింహారావు తదితరులు ఎన్నికయ్యారు.





డిపోను సందర్శించిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్



డిపోను పరిశీలిస్తున్న ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయ్ రత్నం

భీమవరం(ప్రకాశం చౌక్): ఆర్టీసీ డిపోను బుధవారం ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.విజయ్ రత్నం సందర్శించారు. డిపోలో అన్ని విభాగాలు పరిశీలించారు. అనంతరం భీమవరం డిపో అధికారులు, గ్యారేజి, ట్రాఫిక్ సూపర్‌వైజర్లు, డ్రైవర్లు, కండక్టర్లు, మెకానికల్ సిబ్బంది, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి ప్రయాణికులను కేంద్ర బిందువుగా చేసుకొని విధులు నిర్వర్తించాలన్నారు. ఆదాయపరంగా కార్గో బిజినెస్ పెంచుకోవాలని, పశ్చిమ గోదావరి జిల్లా కేంద్రం భీమవరం నుంచి పలు సర్వీసులు పెంచుకొని డిపో ఆదాయం పెంచుకోవడానికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్, భీమవరం డిపో మేనేజర్ పీఎస్‌వీఎం సత్యనారాయణ మూర్తి, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

13న దత్తసాయి ఆలయ 28వ వార్షికోత్సవం

ఉండి: కొత్తపేటలో వేంచేసియున్న లక్ష్మీ గణపతి దత్తసాయి ఆలయ 28వ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వహకుడు సన్నిధిరాజు చలపతిరావు బుధవారం తెలిపారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, లక్ష్మీగణపతి, నవగ్రహ, అష్టలక్ష్మీ హోమాలు, పూర్ణాహుతి నిర్వహిస్తామన్నారు. అదే రోజు 12 గంటల నుంచి అఖండ అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో బాబా ఊరేగింపు కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే బాబా వారికి వెండి సింహాసనాన్ని తయారు చేయిస్తున్న దృష్ట్యా ఆసక్తి గల భక్తులు తమ అమూల్య కానుకలు సమర్పించి రసీదులు పొందాలని చలపతిరావు తెలిపారు.

సీనియారిటీ లిస్టు గందరగోళం

భీమవరం(ప్రకాశం చౌక్): ఉపాధ్యాయ సీనియారిటీ లిస్టులో అంతా గందరగోళంగా ఉందని పీఆర్‌టీయూ ఉపాధ్యాయ నాయకులు జిల్లా విద్యాశాఖ అధికారికి బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో గతంలో తయారు చేసిన సీనియారిటీ లిస్టులను ఎందుకు మార్చారో తెలియజేయాలని డిమాండ్ చేశారు. తప్పుల తడకలుగా ఉన్న ఈ లిస్టులను మార్చి గతంలో ఉన్న లిస్టుకు మాదిరిగా తయారు చేసి రిలీజ్ చేయవలసిందిగా డీఈవోను కోరినట్లు వారు తెలిపారు.

స్మార్ట్ మీటర్లపై లోకేష్ తీరు వినూత్నం

భీమవరం(ప్రకాశం చౌక్): నాడు లోకేష్ పాదయాత్రలో విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించి. నేడు కేంద్రం ఒత్తిడికి తలొగ్గి అమలు చేయడం సిగ్గుచేటని సీపీఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం విమర్శించారు. సీపీఎం పశ్చిమ గోదావరి జిల్లా కమిటీ సమావేశం బుధవారం సుందరయ్య భవన్ మెంటే వారి తోటలో నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న సీతారాం మాట్లాడుతూ ఇప్పటివరకు ప్రజలు విద్యుత్తును వాడుకున్న తర్వాత బిల్లులు చెల్లించే విధానం ఉందని నేడు స్మార్ట్ మీటర్లు పెడితే ముందుగానే ఎంత వాడుకుంటామో దానికి ముందే చెల్లించాలని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కె.గోపాలన్ కె.పెద్దిరాజు, పీవీ ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం(ప్రకాశం చౌక్): ఉగాది ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తులకు స్వీకరిస్తున్నామని ఉగాది పురస్కారం కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి తెలిపారు. భీమేశ్వర స్వామి దేవస్థానంలో ఉగాది ప్రతిభా పురస్కారం దరఖాస్తుల ఆహ్వాన బ్రోచర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 36 ఏళ్లుగా ఉగాది వేడుకలను భీమవరంలో నిర్వహించామన్నారు. జిల్లా స్థాయిలో విశిష్ట సేవాతత్పరులకు ఉగాది పురస్కారాలను అందించి సత్కరిస్తామన్నారు. మార్చి 18వ తేదీ నాటికి బయోడేటను ప్రతిభ వివరాలను నరసయ్య అగ్రహారం-3 రంగసాయి చిరునామాకు పంపించాలన్నారు. వివరాలకు 9490149289లో సంప్రదించాలని ఆయన కోరారు. మార్చి 30న ఉగాది రోజున ఎంపికైన వారికి ఉగాది పురస్కారాలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి తోట శ్రీనివాస రావు, కమిటీ సభ్యులు అరసవల్లి సుబ్రహ్మణ్యం, భట్టిప్రోలు శ్రీనివాసరావు, సూరిశెట్టి కల్పన, పెండ్యాల సరిత పాల్గొన్నారు.

చిన్నారులకు ప్రీ స్కూల్ తప్పనిసరి

ఆకివీడు: అంగన్ వాడీ కేంద్రాలను ప్రభుత్వం ప్రీ స్కూల్‌గా మార్చడంతో చిన్నారులకు మరింత విజ్ఞానం పెంపొందించొచ్చని వీరికి ఇవి తప్పనిసరి అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నకుమారి చెప్పారు. మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం బాల్యారంభ సంరక్షణ విద్య (ఈసీసీఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రీ స్కూల్‌లో చేరే ప్రతి చిన్నారికి ఆటపాటలతో పాటు విద్యను నేర్పుతారని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రీ స్కూల్‌లో చేర్పించి పౌష్టికాహారంతో పాటు తెలివి తేటలు వృద్ధి చెందేందుకు కృషి చేయాలన్నారు.

ఇస్కాన్ నగర సంకీర్తన

భీమవరం (ప్రకాశం చౌక్): స్థానిక హౌసింగ్ బోర్డ్ కాలనీలోని వెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి ఇస్కాన్ ధర్మ ప్రచార రథంతో నగర సంకీర్తన నిర్వహించారు. హరే రామ, హరే కృష్ణ అంటూ హరినామాలు ఆలపిస్తూ పట్టణ వీధుల్లో సంకీర్తన నిర్వహించారు. ముందుగా మందిర అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు ఇస్కాన్ సభ్యులను సత్కరించారు. అనంతరం సంకీర్తనతో హౌసింగ్ బోర్డు కాలనీ నుంచి జేపీ రోడ్డులోని వెంకటేశ్వర స్వామి దేవస్థానం వరకు నగర సంకీర్తన నిర్వహించారు. భక్తులు, ఇస్కాన్ సభ్యులు పాల్గొన్నారు.